క్లుప్తంగా

నియామకం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): భూంపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చింతల లింగం టీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర శాఖ పదవిని కట్టబెట్టినందుకు ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తానని చింతల లింగం పేర్కొన్నారు. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ..



బాన్సువాడ: పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాన్సువాడకు చెందిన జంగం గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న జంగం గంగాధర్ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జంగం గంగాధర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో బాన్సువాడ పద్మశాలి సంఘం నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. బాన్సువాడకు చెందిన వ్యక్తికి రాష్ట్ర స్థాయి పదవి రావడంతో హర్షం వ్యక్తం చేశారు.

లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



కామారెడ్డి అర్బన్: సియాసత్ ఉర్దూ దినపత్రిక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో ఇన్‌చార్జి మహ్మద్ జావెద్ అలీ రాష్ట్ర ప్రభుత్వ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. జావేద్ అలీ 38 ఏళ్లుగా సియాసత్ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నారు. మైనార్టీ వెల్ఫేర్ డే సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.50 వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు. సియాసత్ సంపాదకులు అమేర్ అలీఖాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ ఎక్స్‌లెన్స్ అవార్డు



బాన్సువాడ రూరల్: మలేషియాలో జరిగిన అంతర్జాతీయ ఐటీ సదస్సులో చిన్న రాంపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త మారుతి కుర్మ(ఎన్ఆర్ఐ)కు ఐటీ ఎక్స్‌లెన్స్ అవార్డును తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రదానం చేశారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నట్లు మారుతి తెలిపారు. అవార్డు రావడంపై మారుతి కుర్మ సంతోషం వ్యక్తం చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అరుణ్‌కుమార్ డాక్టరేట్ సాధించినట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న అరుణ్ కుమార్ జేఎన్‌టీయూ యూనివర్సిటీ నుంచి ఆహార పదార్థాల నిల్వలో బయోడెబుల్ ప్లాస్టిక్ వినియోగం అనే అంశంలో పరిశోధన చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారని అన్నారు. దీంతో యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను అందించిందన్నారు. డాక్టరేట్ సాధించిన అరుణ్‌ను కళాశాల అధ్యాపకులు సన్మానించారు.

జీపీ కార్యదర్శిపై ఫిర్యాదు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ జీపీ కార్యదర్శిపై ఎంపీవో సురేందర్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు గుండ్రెడ్డి చిన్న గంగాధర్ మంగళవారం తెలిపారు. తన తండ్రి పేరు మీద ఉన్న 6–67 నంబరు గల ఇంటిని తమ పేర్ల మీద మార్చాలని దరఖాస్తు చేసుకున్నప్పటికి రికార్డుల్లో మార్పులు చేయలేదన్నారు. ఎలాంటి మార్పులు చేయకుండానే తన సోదరుడు పెద్ద గంగాధర్ ఇంటి పన్ను చెల్లిస్తే ఎలా తీసుకుంటారన్నారు. తాను ఇంటి పన్ను కట్టడానికి ఇటీవల గ్రామ పంచాయితీకి వెళ్లగా ఫీ విషయం తెలిసిందన్నారు. తనకు సంబంధించిన ఇంటి పన్నును ఇతరులు చెల్లిస్తే ఎలా తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

ఎల్లారెడ్డిరూరల్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ఉండాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 10వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతి, సుభాష్‌అప్ప, శ్రీనివాస్, విద్యాసాగర్, పోచయ్యలున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరకొర వసతులు

- అంతంత మాత్రంగానే వైద్య సేవలు
- ఆపరేషన్ పరికరాలు లేవంటున్న వైద్యులు



గాంధారి(ఎల్లారెడ్డి): పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు ఉంది మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రి పరిస్థితి. మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ఉన్నా వైద్య సేవలు సరిగా అందడంలేదు. తగినన్ని వసతులు లేక వైద్యులు, సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ను ఐదారేళ్ల క్రితం సీహెచ్‌సీగా మార్చారు. కానీ వసతులు మాత్రం కల్పించలేదు. మారుమూల గిరిజన మండలం కావడంతో గ్రామాలు, తండాల నుంచి ప్రతి రోజు రోగులు వస్తుంటారు. ఎన్నో ఆశలతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు సరైన వైద్యం అందడం లేదు. రోగాలు నయం కాక కొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రికి వైద్యులను నియమించినా ఇక్కడి పరిస్థితులు చూసి వైద్యులు ఎక్కువ రోజులు విధులు నిర్వర్తించడం లేదు. ఏదో కారణంతో బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం నలుగురు వైద్యులు విధుల్లో ఉన్నారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సంగీత్ కుమార్, ఇద్దరు ఎంబీబీఎస్ మహిళా వైద్యులు, ఒక దంత వైద్యులు ఉన్నారు. వైద్యులు సమయానికి అందుబాటులో ఉండరని రోగులు, ప్రజల్లో అభిప్రాయం ఉంది. ఇటీవలే రోగులకు సేవలు అందడం లేదని వారి కుటుంబసభ్యులు ఆందోళన కూడా చేశారు. వారం క్రితం వైద్యులు అందుబాటులో లేక నర్సులు ఓ గర్భిణీకి ప్రసవం చేయడంతో శిశువు పుట్టగానే మృతి చెందింది. వైద్యులు అందుబాటులో ఉండరనే ఉద్దేశంతో చాలా మంది రోగులు అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వైద్య సేవలు సరిగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

పేద రోగులు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుంటారు. వైద్యులు అందుబాటులో లేక నర్సులు మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు. రోగులు డాక్టరు పరీక్షించడం లేదని అసంతృప్తితో తిరిగి వెళ్తున్నారు. రోగాలు నయం అవుతలేవనే భావన కల్గుతోంది. డాక్టరు అందుబాటులో ఉండి అవే మాత్రలు ఇచ్చినా రోగులకు నమ్మకం కలుగుతుంది. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించాలి.

– పరమేశ్వర్ రెడ్డి, తిమ్మాపూర్

సరైన వసతులు లేవు

ఆస్పత్రి భవనంలో కొన్ని వార్డులు శిథిలావస్థకు చేరుకున్నాయి. భద్రత లేదు. చుట్టూ చెట్లు పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు, కీటకాలు వస్తాయనే భయం ఉంది. ఆపరేషన్ థియేటర్ లేదు. ఉన్న థియేటర్లో కొన్ని పరికరాలు చెడిపోయాయి. రోగులకు ఆపరేషన్ చేయాల్సి వస్తే థియేటర్ సరిగాలేక చేయలేక పోతున్నాం. డ్రైనేజీ సమస్య ఉన్నది. రాజకీయ నాయకులు, అధికారులు కల్పించుకుని వసతులు కల్పిస్తే రోగులకు వైద్య సేవలు మెరుగుపడతాయి.

– సంగీత్ కుమార్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, గాంధారి సీహెచ్‌సీ

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ : డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మంగళవారం బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీ, శాంతి నగర్, బేతాళస్వామి కాలనీల్లో సొంత స్థలాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.27 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికీ బిల్లు వచ్చేలా చూస్తామని అన్నారు. పెండింగ్ బిల్లులు త్వరలో మంజూరవుతాయని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు శ్రావణ్, కిరణ్, నార్ల ఉదయ్, జలపతి రెడ్డి తదితరులున్నారు.

రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించండి



బాన్సువాడ: నాయీ బ్రాహ్మణుల జనాభా ప్రతిపాదికన రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలని మంగళవారం బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్ రావుకు నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ అధికారులు, నిపుణుల సంఘం ప్రతినిధి తుకారం మాట్లాడుతూ.. 75 ఏళ్లుగా ఏ ఒక్క నాయీ బ్రాహ్మణ కుల సభ్యుడు ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గాని లేకపోవడం బాధాకరమని అన్నారు. సంఘం ప్రతినిధులు సూర్యనారాయణ, సుధాకర్, చంద్రయ్య, గోపాల్, అనిల్ కుమార్‌లు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులు అడివిలింగాల గేట్ వద్ద ఆపాలి



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడివిలింగాల గేట్ వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని కోరుతూ విద్యార్థులు మంగళవారం రాస్తారోకో చేశారు. అడివిలింగాల గేట్ వద్ద గల ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు వెళ్లేందుకు సమయానికి బస్టాప్ వద్దకు వచ్చినా బస్సులు ఆపకపోవడంతో కళాశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వెలిబుచ్చారు. అధికారులు స్పందించి విద్యార్థుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు.

వడ్డెర వృత్తి వీడియో పాట ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: మాచారెడ్డి మండలం లక్ష్మీరావుపల్లి గ్రామానికి చెందిన కృష్ణ, హరిలు వడ్డెర సామాజికవర్గ వృత్తికి సంబంధించి చిత్రీకరించిన వీడియో పాటను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వడ్డేర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తారి మారన్న చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గణేష్ నాయక్, వడ్డెర సంఘం ప్రతినిధులు దశరథ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న టీచర్లపై వేధింపులు ఆపాలి



కామారెడ్డి అర్బన్: సమగ్ర సర్వే నిర్వహిస్తున్న టీచర్లపై అధికారులు వేధింపులు నిలిపేయాలని పీఆర్‌టీయూ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.కుషాల్, పుట్ట శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు జిల్లా నాయకులు మంగళవారం సాయంత్రం అదనపు కలెక్టర్‌ను కలిశారు. సెలవు దినాల్లోనూ ఉదయం పూట సర్వే చేయాలని ఆదేశించడం తగదన్నారు. సెలవులు పెట్టడానికి వీలు లేదని నిబంధన విధించడం మానుకోవాలని, స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

ఆధ్యాత్మికం

కార్తీక ఏకాదశి దీపోత్సవం



కామారెడ్డి అర్బన్: కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం పట్టణ పరిధిలోని దేవునిపల్లి శ్రీరామ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళ భక్తులు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపోత్సవంతో విశేష ఫలితాలుంటాయని ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ అన్నారు.

విఠలేశ్వరుడి ఆలయంలో..

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని విఠలేశ్వరుడి ఆలయంలో మంగళవారం కార్తీక ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వంగపల్లి నాగభూషణం, ఆలయ పూజారి ప్రణయ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్‌లో కుర్మసంఘం ఆధ్వర్యంలో మంగళవారం మల్లన్న ఆలయ 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అభిలాష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిక ప్రత్యేకపూజలు చేశారు. వార్షికోత్సవంలో తాండూర్, కిచ్చన్నపేట, అక్కంపల్లి గ్రామాలకు చెందిన కుర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బైరాపూర్‌లో లక్ష తులసి దళార్చన

నస్రుల్లాబాద్ (బాన్సువాడ): బీర్కూర్ మండలంలోని బైరాపూర్ గ్రామంలో గల విఠలేశ్వర మందిరంలో మంగళవారం లక్ష తులసి దళార్చన నిర్వహించారు. కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు లింగాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తులసి పూజ

కామారెడ్డి రూరల్: లింగాపూర్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా 13న ఉదయం 9 గంటలకు తులసి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రవికాంత్ తెలిపారు. అనంతరం మహిళలతో క్షీరాబ్ది(చిలుక దంచుట) ద్వాదశి కార్యక్రమం ఉంటుందన్నారు.

ధాత్రి నారాయణుల కల్యాణ మహోత్సవం

కామారెడ్డి రూరల్: ఉగ్రవాయి శివారులోని షిరిడీ సాయి ప్రేమ మందిరంలో కార్తీక ద్వాదశిని పురస్కరించుకుని 13న ఉదయం 9.45 గంటలకు తులసి బృందసహిత ధాత్రీ నారాయణుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి బచ్చు విజయ్‌కుమార్ సాయిరాం తెలిపారు. భక్తులు హాజరై సామూహిక తులసీ వ్రతాలలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం సామూహిక కార్తీక ఉసిరి వన భోజనాలు ఉంటాయని పేర్కొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ మేనేజర్ పాల్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్ సూచించారు. మంగళవారం పద్మాజీవాడి చౌరస్తా వద్ద కార్గో సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. వస్తువు మీది.. బాధ్యత మాది అంటూ ఆర్టీసీ కార్గో సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏదైనా పార్శిల్ ఉంటే త్వరగా గమ్యస్థానానికి చేరుకునేందుకు ప్రత్యేక చొరవతో పాటు, పంపించే వస్తువులపై తమ బాధ్యత ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కాశీరాం, ఎగ్జిక్యూటివ్‌లు ఇర్ఫాన్, షాహీద్, దస్తగిరి, రాజిరెడ్డి, అంజిల్‌రెడ్డి, ఎండీ, కాశీం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బాన్సువాడ: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో విద్య బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కులకర్ణి కిషోర్ రావు, తుప్తి నాగరాజు, అనీల్, సుధాకర్, గంగులాల్, అక్బర్, ప్రశాంత్, శేఖర్ తదితరులున్నారు.

లింగంపల్లి రోడ్డుకు మోక్షం

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట జీపీ పరిధిలోని లింగంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పనులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకారం చుట్టారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నిధులు మంజూరు చేయడంతో మట్టి, మొరం పనులు చేపడుతున్నారు. నాయకులు లక్ష్మయ్య, బంగ్ల ప్రవీణ్, రాము రాథోడ్ తదితరులున్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో షబ్బీర్, షెట్కార్ ప్రచారం



కామారెడ్డి టౌన్/భిక్కనూరు: మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్ పాల్గొన్నారు. మంగళవారం నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌లో నిర్వహించిన ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వారి వెంట కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

సర్వేకు దరఖాస్తు ఫారాల కొరత

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు దరఖాస్తు ఫారాల కొరత వేధిస్తోంది. బిచ్కుంద మండలంలో 27 జీపీలలో 15,064 ఇళ్లు ఉన్నాయి. సర్వే కోసం 110 బ్లాకులుగా విభజించారు. 106 మంది ఎన్యూమరేటర్లు, పర్యవేక్షణ కోసం 10 మంది సూపర్‌వైజర్లను అధికారులు నియమించారు. పై అధికారుల ఆదేశాల మేరకు ఎన్యుమరేటర్లు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. వారి వద్ద సరిపడా ఫారంలు లేకపోవడంతో మండలంలో సర్వే వేగంగా కొనసాగడం లేదు. 15,064 ఇళ్లు ఉండగా ఒక్కో ఇంటిలో తల్లిదండ్రులు, కొడుకు కోడళ్లు ఒకే ఇంటిలో వేర్వేరుగా ఉంటున్నారు. ఒకే హౌస్ నెంబరులో వేర్వేరుగా రెండు, మూడు సర్వే ఫారంల అవసరం ఉంది. మండలానికి నామమాత్రంగా ఫారాలు వచ్చాయి. దరఖాస్తు ఫారంలను జిరాక్స్ తీసుకొని సర్వే పూర్తి చేయాలని సూపర్‌వైజర్లు సూచిస్తున్నారు. సర్వే ఫారంల జిరాక్స్ సొంత డబ్బులతో పెట్టుకోలేమని, చాలా ఖర్చు అవుతుందని ఎన్యూమరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు రుణపడి ఉంటామని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. లింగంపేట్ మండలం కన్నాపూర్‌కు చెందిన విద్యార్థిని(బీఎస్సీ నర్సింగ్)కి హైదరాబాద్ నిమ్స్ కళాశాలలో సీటును కేటాయించాలని కోరిన వెంటనే సంబంధిత యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థినికి సీటు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జోనల్ క్రీడా పోటీల పరిశీలన



బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపు తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలను మంగళవారం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిణి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కాసేపు క్రీడల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జోనల్ అధికారి ప్రత్యూషను ఆదేశించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ మంత్రి, బీజేపీ నేత నేరెళ్ల ఆంజనేయులు



బీజేపీ సభ్యత్వం చేయిస్తున్న ఆంజనేయులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బీజేపీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత నేరెళ్ల ఆంజనేయులు అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పార్టీ గురించి దిశానిర్దేశం చేశారు. సంస్థాగత ఎన్నికలలో భాగంగా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు రవీందర్ రావు, మర్రి బాపురెడ్డి, గంగారెడ్డి, హోటల్ శ్రీనివాస్, వెంకట్‌రావు, దత్తు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం ఫలితాలను వెల్లడించాలి



మాట్లాడుతున్న విండో ఇన్‌చార్జి చైర్మన్ మద్ది స్వామి

భిక్కనూరు: బస్వాపూర్ సింగిల్ విండో అప్పటి చైర్మన్ లింగాల కిష్టాగౌడ్‌పై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఫలితాన్ని జిల్లా సహకార శాఖాధికారి వెంటనే వెల్లడించాలని ఇన్‌చార్జి చైర్మన్ మద్ది స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బస్వాపూర్‌లో బీఆర్ఎస్ నేతలతో కలిసి మాట్లాడారు. సహకార శాఖాధికారులు అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తున్నారని, వెంటనే వారు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని లేకుంటే కోర్టు ధిక్కరణ కింద కేసు వేస్తామన్నారు. నేతలు మల్లారెడ్డి, సిద్దరాములు, రాజిరెడ్డి, భిక్షపతి, రాంజంపేట విండో వైస్ చైర్మన్ అంద్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మొరం టిప్పర్ పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): కందర్‌పల్లిలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం ఎస్సై మోహన్‌రెడ్డి పట్టుకున్నారు. అనుమతి లేకుండా తరలిస్తుండడంతో పట్టుకొని కేసు నమోదు చేశారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నామని, ఎన్బురు మంజీర నుంచి ఇసుక తరలిస్తుండగా గోపన్‌పల్లి చౌరస్తాలో పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది గ్రామంలో మంగళవారం హ్యాండ్ ఆఫ్ హోప్, ఒమేగా ఫైయర్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జయరాజ్, నవ్య, దివ్యలు రోగులకు వైద్యం అందించారు. పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. పాస్టర్ అంటోనిరాస్, రాణీరాస్ పాల్గొన్నారు.

మైలారంలో పశు వైద్య శిబిరం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని పశు గణన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పశుగణన అభివృద్ధి సంస్థ డాక్టర్ మాజిద్ అహ్మద్ రైతులకు పలు సూచనలు చేశారు. మండల పశువైద్య అధికారి మహేష్ నాయక్, డాక్టర్లు మారుతి, మణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూంపల్లిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): భూంపల్లి గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌వో సంజీవ్‌కుమార్ మాట్లాడారు. పశువులకు ఇచ్చే దాణా, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ డైరెక్టర్ షకీల్, పశు వైద్యులు రాంచందర్, రమేశ్, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

తిప్పాపూర్‌లో..

భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరాన్ని భిక్కనూరు మండల పశువైద్యాధికారి దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ గర్భధారణకు టీకాలు వేయించాలని సూచించారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కేవలం ఆడ దూడలు జన్మిస్తాయన్నారు. పాల కేంద్రం అధ్యక్షుడు కుంట లక్ష్మారెడ్డి, పశువైద్యుడు అనిల్, సిబ్బంది క్రిష్ణ, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సదర్ సంఘం కమిటీ ఎన్నిక

బీబీపేట: మండల కేంద్రంలోని ముదిరాజ్ సదర్ సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోమల సిద్దరాములు, ఉపాధ్యక్షుడిగా మ్యాదరి ఎల్లేష్, కార్యదర్శిగా జంగిటి స్వామి, కోశాధికారిగా తోడేటి నర్సింలు, ప్రచార కార్యదర్శిగా నిజ్జని బాలప్ప, తదితర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేస్తామని అధ్యక్షుడు సిద్దరాములు అన్నారు.

రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి శృతి సూచించారు. మంగళవారం రాజంపేట మండల వ్యవసాయ అధికారిణిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ప్రతి మంగళవారం ఆన్లైన్లో ప్రచారం అయ్యే రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని శాస్త్రవేత్తలు సూచించిన సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు.